
# వసంతస్వప్నం...



మరో ప్రాత:కాలపు వేళ. మబ్బులు రోడ్లూ యిళ్ళూ యింకా నిద్రమత్తు విడవనే లేదు.

గది తలుపుని దబదబా బాదుతోంటే- వసంతం కమ్ముకొస్తోంది. అరణ్యాల మీంచి పొలాల మీంచి సెలయేటి తీరాల్లోంచి తోటల్లోంచి...

పచ్చని కలని చెదరగొడుతూ తలుపుని బాదుతోంది యెవరాని కలల రెప్పలని విప్పింది నిత్యకళ్యాణి.

ఆ శబ్దానికి నిద్రమత్తులోంచి విసుక్కుంటూ లేచి పక్కనున్న నిత్యకళ్యాణి మంచం వైపు చూసింది సంజన.

సంజనా కళ్ళిప్పటం చూసి తిరిగి తన వసంతస్వప్నం కోసం కనెప్పలని మూసు కొంది నిత్యకళ్యాణి.

'వూ... గాడ్...' అనుకొంటూ చిరాగ్గా వెళ్ళి తలుపు తీసింది సంజన. యెదురుగా నైటీలో కేర్‌టేకర్. పక్కనే ఛామనచాయ రంగుతో బొద్దుగా ముద్దుగా గుండ్రని కళ్ళతో పూలపూల సల్వార్ కమీజ్‌తో వొక్క జడతో కాస్త అలసిపోయిన ముఖంతో సుమారు తన వయస్సే వున్న అమ్మాయిని చూస్తూ, 'కొత్త రూమ్మేట్,' అనుకొంటూ సంజన గుమ్మానికి కాస్త పక్కగా తప్పుకొంది.

రెండు పెద్ద సూట్‌కేసులు యెర్ర ప్లాస్టిక్ డబ్బా నీలం యెయిర్‌బ్యాగ్ నల్ల పొడవు హేండ్‌బ్యాగ్‌తో లోపలికి వస్తున్న ఆ అమ్మాయి షాట్స్‌లో వున్న సంజనని చూసి, 'యేం వుద్యోగమో... చూడ్డానికి బానే వుంది,' అనుకొంటూ, "నా మంచం యేది, షెల్ఫ్ యేది," అని కేర్‌టేకర్ని అడిగింది.

కేర్‌టేకర్ వాటిని చూపించి, "మీ కొత్త రూమ్మేట్. న్యూస్ పేపరాఫీసులో వుద్యోగం. ప్రవీణ," అని సంజనకి చెప్పి, "తన పేరు సంజనా. కాల్‌సెంటర్‌లో జాబ్. ఆ నిద్రపోతున్న అమ్మాయి నిత్యకళ్యాణి. టివిలో పొలిటికల్ రిపోర్టర్," అంది.

"మీదే వూరు," ప్రవీణ అడిగింది.

"తెలియదు... కనుక్కొని చెపుతా," యింగ్లీషులో అనేసి వెళ్ళి తన మంచంపై పడుకొంది సంజన.

ప్రవీణ రాకతో చెదిరిపోయిన తన స్వప్నాన్ని తిరిగి చూడాలని నిద్రపోవటానికి ప్రయత్నిస్తోంది నిత్యకళ్యాణి. నిద్రరావటం లేదు. కల తిరిగి వచ్చే అవకాశం కనిపించటంలేదు. వుత్తినే అలా మంచంపై దొర్లలేక లేచి కూర్చుంది. ప్రవీణ తన మంచంపై హాయిగా నిద్రపోతోంది. సంజన తన మంచంపై లేచి కూర్చుంటూ, "మన నిద్ర చెడగొట్టి, తను మాత్రం యెంత హాయిగా నిద్ర పోతోందో చూడు," అంది.

బద్ధకంగా నవ్వి, "వాక్‌కి వెళదామా," అని అడిగింది నిత్యకళ్యాణి.

యిద్దరూ బయటకొచ్చారు. పంజాగుట్ట సెంటర్ వరకు వచ్చి మూల మీదున్న టీ బండి దగ్గర ఆగారు.

టీ తాగుతూ యిద్దరూ పక్కనే వున్న బండ మీద కూర్చున్నారు.

'ఎం.బి.ఎ.కి కట్టాను. స్టడీ మెటీరియల్ వచ్చింది. చదవటం మొదలుపెట్టాలి. రేపు మా ఆఫీసులో పార్టీ వుంది. ఐబ్రోస్ పెరిగిపోయాయి. పార్లర్‌కి వెళ్ళాలి. ఫేషియల్ చేయించుకోవాలి. రాత్రంతా నిద్రపోయి యెన్నాళ్ళయిందో," అంది సంజన.

"నీకీరోజు సెలవేగా. యీ పనులన్నీ యివాళే పూర్తి చేసుకో. రేపు ఫ్రెష్‌గా పార్టీకి వెళ్ళొచ్చు. ఐబ్రోస్ చేయించుకోవాలి. అస్సలు టైమ్ దొరకటంలేదు. వో కొత్త ప్రోగ్రామ్ ఆలోచించా. ఆ ప్లానింగ్‌తో బిజీ," అంది నిత్యకళ్యాణి.

"వుద్యోగాలు చేస్తూ క్వాలిఫికేషన్స్ పెంచుకొంటూ బాడీ మెయిన్‌టైన్ చేస్తూ, మరోవైపు పర్సనల్ లైఫ్‌లో సెటిల్ అవ్వటానికి ట్రై చేస్తూ యిలా పరిగెడుతుంటే మా మమ్మీకి మన లైఫ్ చాలా బాగుందంట. వాళ్ళ టైమ్‌లో చదువు, వుద్యోగం, పెళ్ళి. యింతేనంట. మీరెంత కష్టపడితే మీకంత బ్రైట్ ఫ్యూచర్ అంటుంది," అంది సంజన.

"కానీ మనకి ప్రతి విషయంలోనూ యిన్‌సెక్యూరిటీ వుంది కదా. పరుగు ఆపినా కష్టమే. కాస్త తక్కువ పరిగెత్తినా కష్టమే. బాగా పరిగెత్తినా వొక్కోసారి గ్యారెంటీ లేదు. కాకపోతే యిప్పుడు యెలాగోలా యెందులోనైనా నిలబడగలిగే వాతావరణం వున్నట్టు వుంది. యిది మాయ కావొచ్చు, లేదా భ్రమా కావొచ్చు. కానీ మనం కావాలనుకునే ఫీల్డ్‌లోకి వెళ్ళే అవకాశం వుంది. దానికోసం మనం బాగా పరిగెత్తాలి. పరిగెత్తలేకపోవటం మన లోటే అవుతుంది కాని ఆ బాధ్యతని తీసుకొనే సిస్టమ్ యిప్పుడు మన చుట్టూ లేదు. ప్రతి విషయంలోనూ యిన్‌సెక్యూరిటీనే. వొక్కోసారి యీ నిశ్చింత లేనితనం విసుగ్గా వుంటుంది," టీకి డబ్బులిస్తూ అంది నిత్యకళ్యాణి.

"యింత యెనలిటికల్ విషయాలు నీకెలా తెలుస్తాయి," అడిగింది సంజన.

"సాహిత్యం..." అని నవ్వి, "యిప్పుడు యెనలిటికల్‌గా విషయాలు తెలియకపోయినా పర్లేదు. కానీ పాపులర్‌గా తెలియాలి," అంది నిత్యకళ్యాణి.

"అంటే"

"కాస్త పాపులర్ రిపోర్టింగ్ పేజ్-3 చేయమంటున్నారు మా బాస్," అంటూ చిన్నగా నవ్వింది.

"గుడ్... గుడ్... పార్టీస్, ఫ్యాషన్ షోస్, గాసిప్... రేపు మా పార్టీ రిపోర్ట్ చెయ్... మంచి యీజిప్షియన్ పెర్‌ఫ్యూమ్ వేసుకెళతా... మా పాత టీమ్‌లీడర్ మారి పోయింది. పెద్ద రిలీఫ్. యీ కొత్త బాస్ ఫన్ లవింగ్. పని. గుడ్‌పార్టీస్. హెపీ" యిద్దరూ హాస్టల్‌కి వచ్చేసరికి హాల్లో హాస్టల్లో అమ్మాయిలు టివి చూస్తూ ఫేస్‌పేక్స్ అరబెట్టుకుంటూ, త్వరత్వరగా బ్రేక్‌ఫాస్ట్ చేస్తూ ఆఫీసులకి లంచ్‌బాక్స్ సర్దు కొంటూ సెల్‌ఫోన్స్‌లో మాట్లాడుతూ హడావుడిగా వున్నారు. వీళ్ళిద్దరూ రూంలోకి వచ్చేసరికి ప్రవీణ సామాను సర్దుకోవడంలో బిజీగా వుంది.

కళ్యాణి రెడీ అయి వెళ్ళిపోయింది.

జీన్స్‌లో రెడీ అయి సంజన బయటికి వెళ్ళబోతుంటే, "నాకీ వైపు నచ్చలేదు. మీరు నేనూ మంచాలు మార్చుకుందామా," అడిగింది ప్రవీణ.

"మారిస్తే నాకూ నచ్చదే... యెలా"

"పోనీలెండి. కళ్యాణిగారిని అడుగుతా. నా జీన్స్, టాప్స్, షాట్స్ సర్దుకొన్న బ్యాగ్ ట్రైన్‌లో మిస్ అయింది. కొత్తవి కొనుక్కోవాలి. యెక్కడ బాగుంటాయి," అడిగింది ప్రవీణ.

"చాలాచోట్ల బాగుంటాయి లైఫ్ స్టయిల్, షాపర్స్ స్టాప్, వెస్ట్ యెండ్... మీ యిష్టం," అంది సంజన.

"మీరెక్కడ కొంటారు"

"మా వూరు నుంచి తెచ్చుకొన్నవే. యిక్కడెప్పుడూ కొనలేదు," అంది సంజన.

"షాపింగ్‌కి వస్తారా," అడిగింది ప్రవీణ.

"టైమ్ లేదు. బై," అంది సంజన.

'మహా టెక్కులా వుందే... తన బ్యాగ్ విషయం అబద్ధమని పసికట్టిందా,' అనుకొంది ప్రవీణ.

✦

ప్రెస్‌క్లబ్‌లో పుస్తకావిష్కరణ వుంటే కవరేజ్‌కి వెళ్ళింది నిత్యకళ్యాణి. బయటికి

వస్తూంటే, 'హలో' అని వినిపిస్తే వెనక్కి చూసింది.

శిరీష్... కవి. ప్రస్తుతం వో న్యూస్‌పేపర్‌లో వుద్యోగం.

"హలో," అంది.

"జాబ్ యెలా వుంది," అడిగాడు.

"గుడ్."

"బిజీనా..."

"యేం"

"డిన్నర్‌కి వెళదామా..."

"డిన్నర్..."

"వూ... నా బర్త్‌డే."

"వౌ... మెనీ హేపి రిటర్న్స్ ఆఫ్ ది డే."

"వస్తారా"

"యెక్కడ"

"మీరు చెప్పండి."

"మీరు చెపితేనే మంచిది. మీకు నచ్చే ప్లేస్ తెలియదుగా."

"యిప్పుడు ఆఫీసుకా," అడిగాడు.

"ఆఁ"

"మీ పని అవ్వగానే బంజారాహిల్స్‌లో కె.బి.ఆర్. పార్క్ దగ్గరికి రండి," అన్నాడు.

ఆమె అక్కడికి వెళ్ళింది. అప్పటికే అక్కడ యెదురుచూస్తున్న శిరీష్ ఆమెని తీసుకొని రెస్టారెంట్‌కి వెళ్ళాడు.

లాన్‌లో వో మూల కూర్చున్నాక, "వస్తారో రారో అనుకున్నా. థ్యాంక్స్," అన్నాడు.

ఆరుబయట వాలుతోన్న నక్షత్ర కిరణాలని చూస్తూ, "మీరే వూర్లోపుట్టారు," అని అడిగింది.

“విజయవాడ.”

“యెన్ని గంటలకి.”

“యేమో... నేనెప్పుడూ యీ విషయం మా అమ్మని అడగలేదు,” అన్నాడు. చిన్నగా నవ్వి, “వుండండి యిప్పుడే అడుగుతా,” అని వెళ్ళి వాళ్ళ అమ్మకి ఫోన్ చేశాడు.

కాసేపు మాట్లాడి వచ్చి, “సాయంకాలం తొమ్మిదిన్నరకంట,” అన్నాడు.

“సో మీరింకా పుట్టలేదన్నమాట,” అంది.

ఆర్డర్ చేసి సాహిత్యలోకపు కబుర్లు చెప్పుకొంటున్నారు.

అతని కవిత్వంలోని తడి ఆమెకి నచ్చుతుంది. అపారంగా సాహిత్యాన్ని చదువు కొన్న అనుభవం, విషయాలని విశ్లేషించే తీరు ఆమెని ఆకర్షించేవి. యెప్పుడైనా కనిపించినప్పుడు యేకధారగా మాట్లాడేవాడు. యిలా యేకాంతంగా వో చోట కూర్చుని యిష్టమైనవి తింటూ కబుర్లు చెప్పుకోవడం యిప్పుడే. తొమ్మిదిన్నర అవుతోంటే, ‘యిప్పుడే వస్తా,’ అని వెళ్ళి తిరిగొచ్చి అతనికి పువ్వులగుత్తిని అందించింది. వాచ్ వైపు చూసుకొంటూ అందుకొన్నాడు.

అతను ఆశ్చర్యానందాలతో చిరునవ్వుని దాచుకోలేకపోయాడు.

“నాకెంతో యిష్టమైన పువ్వులు యివి,” అన్నాడు.

“తెలుసు.”

“యెలా”

“మీ వాక్యాలకి వున్నది యీ పరిమళమేగా...” అంది చిరునవ్వుతో.

ప్రకాశవంతమైన ఆ మాటలకి అతను కదిలిపోయాడు.

యింత సంతోషాన్ని వూహించలేదు.

బిల్ పే చేస్తుంటే అతనికి యింకాసేపు వుండాలనిపించింది. సాధారణంగా సాగిపోతోన్న జీవితంలో ఆమె ప్రశంస అతనిలో నింపిన భావోద్వేగంతో అతను యింకొంచెంసేపు ఆమె సమక్షంలో గడపాలనుకున్నాడు. కానీ సాధ్యమయ్యేలా కనిపించలేదు. రెస్టారెంట్ మూసే సమయం అయింది.

యిద్దరూ బయటికి వచ్చారు.

"థ్యాంక్ యూ వెరీ మచ్. బాగా గుర్తుండిపోయే పుట్టినరోజు," అన్నాడు.

ఆమె చిన్నగా నవ్వి, "గుడ్ నైట్," అని వెళ్ళిపోయింది.

అలా అప్పుడప్పుడు వాళ్ళిద్దరూ కాఫీషాప్‌లో కలుస్తుండేవారు. సాహిత్య విషయాలు దొర్లుతుండేవి. పుస్తకాలలో విషయాలని చర్చించుకునేవారు. అతను ఆమెకి తను రాసినవి కొత్తగా చదివిన తనకి నచ్చిన కవిత్వం ఆమెకి వినిపిస్తుండేవాడు. మధ్యమధ్యలో తమ యింటి విషయాలు పంచుకొనేవారు. "సాహిత్యసభకి విశాఖ వెళ్ళి అక్కడ నుంచి సభకి వచ్చిన మిత్రులంతా కలిసి సరదాగా అన్నవరం వెళదాం అనుకొంటున్నాం వస్తారా," అడిగాడు శిరీష్.

"వూ... వస్తా," వుత్సాహంగా అందామె.

"అక్కడ నుంచి అరకు, సింహాచలం, అన్నవరం కూడా వెళుతున్నాం అంతా," అన్నాడు.

దూరంగా పచ్చని నీలికెరటాల్లా కొండలు. నిశ్చలంగా పంపా సరసు. తురాయి పూలు పూసిన కొండ. మెట్ల మీద పచ్చని గీతలు. సువర్ణగన్నేరు పువ్వుల హాయైన గాలుల అలలు మెత్తగా స్పర్శిస్తుంటే ప్రభాతవేళ అన్నవరం దేవాలయపు మెట్ల మీద కూర్చుంది నిత్యకళ్యాణి. ఆమె పక్కనే వచ్చి కూర్చున్నాడు శిరీష్.

అతనివైపు చూస్తూ మెత్తని నవ్వు నవ్విందామె పలకరింపుగా.

"యెంతో బాగుంది కదా. మనం యీ వుదయాలని మిస్ అవుతున్నాం," అన్నాడు.

"నచ్చితే యిక్కడే వుండిపో శిరీష్," అంది.

"మరి నువ్వో."

"ముందు నీ బిజీలైఫ్‌ని వదులుకొని యిక్కడ సింపుల్‌గా వుండగలవా," అడిగింది.

"నువ్వూ... నువ్వు చెప్పు."

"ప్రతిదానికీ నువ్వూ... నువ్వు చెప్పు... అంటావేంటి. నువ్వేం అనుకొంటున్నావో ఆ విషయం చెప్పు." అతను మాట్లాడలేదు.

కాసేపయ్యాక, "యిలాంటి వుదయాలలో మూలాలు వుండడంతో యెదురు పడగానే యివి కావాలనిపిస్తాయి. కానీ వీటి నుంచి వేరు చేయబడి చాలాకాలం

అవ్వటం, యిక్కడుండి యేం చెయ్యాలో తెలియదు. నగరంలోని ఆ వేగం ఆ మెరుపు ఆ కొత్తదనంలో యేదో మత్తు వుంటుంది. ఆ మత్తుకి అలవాటుపడ్డాను. ఆ మత్తు కావాలి. పసితనపు జ్ఞాపకాలని కలబోసుకోడానికి నీలాంటి స్నేహితురాలు కావాలి. చాలారోజులుగా చెప్పాలనుకుంటున్నా. మనం పెళ్ళి చేసుకుందామా నిత్యకళ్యాణీ," అని అడిగాడు.

అతన్నుంచి వచ్చిన యీ ఆహ్వానానికి ఆమె పెద్దగా ఆశ్చర్యపోలేదు. అతనికి తనపట్ల ఆత్మీయత వుందని తెలుసు. కానీ యీ ఆత్మీయతని జీవితంలోకి యెలా అనువదించుకోవాలనుకొంటున్నాడో కచ్చితంగా తెలియదు. యిప్పుడిలా అతను స్పష్టంగా తన మనసులో మాట చెప్పాడు.

"యేమంటావ్" తిరిగి అడిగాడు.

ఆమె చిన్నగా నవ్వి, "కాదనటానికి కారణాలేం కనిపించటంలేదు," అంది.

అతని హృదయం వుప్పొంగింది.

✦

యీ పెద్ద నగరంలో తనకొచ్చే జీతంతో చాలా సాదాసీదాగా జీవితం గడపాల్సి వస్తుందని ప్రవీణ రెండ్రోజుల్లోనే గమనించింది. కాస్త మంచి వుద్యోగంలోకి మారిపోవాలని నిర్ణయించుకొని చుట్టూ చూపులు ప్రసరించింది. యేయే అవకాశాలు వున్నాయో రాసుకొంది. నిత్యకళ్యాణితో అతి మృదువుగా మాట్లాడుతూ మెల్లగా వో టి.వి. ఛానల్లో ఆమె ద్వారా పరిచయాలు పెంచుకొంది. వుద్యోగం సంపాదించింది. యాంకర్ మాట్లాడే మాటలు రాసే ఆ వుద్యోగం నుంచి యింకా పైపైకి వెళ్ళి ఆ రంగంలో యెలా నిలదొక్కుకోవాలా అని ఆలోచిస్తోంది.

"పార్టీ యివ్వు," సంజనా నిత్యకళ్యాణిని పదేపదే అడుగుతోంది.

"నువ్వే యివ్వు," అందామె.

"నేనా... యెందుకు?..."

"నీ స్నేహితురాలికి మంచబ్బాయి దొరికాడని," అంది నిత్యకళ్యాణి.

"యేంటి విషయం... భలే హేపీగా వున్నారే," అంటూ గదిలోకి వస్తూ అడిగింది ప్రవీణ.

"నిత్యకళ్యాణి పెళ్ళి," సంతోషంతో చెప్పింది సంజన.

"వో... కంగ్రాట్స్... యెప్పుడు, యెక్కడ?" అడిగింది ప్రవీణ.

"శిరీష్ అని వో జర్నలిస్ట్, కవి," అంది సంజన.

"బాగా రాస్తాడా," అడిగింది ప్రవీణ.

"చాలా బాగా... పార్టీ యివ్వు," అంది సంజన.

"మనమే యిద్దాం... మాకు అతన్ని పరిచయం చెయ్యి," అడిగింది ప్రవీణ.

"యిప్పుడప్పుడే కాదు. యింకా టైమ్ వుంది. సంజనాకి కాస్త తెలుసు అతను. త్వరలో పరిచయం చేస్తాలే," అంది నిత్యకళ్యాణి.

సంతోషంతో మిలమిలా మెరుస్తోన్న నిత్యకళ్యాణి కళ్ళు చూస్తుంటే ప్రవీణకి లోలోపల మంటగా అనిపించింది. తమ పెళ్ళిళ్ళ విషయం పట్టించుకోని యింటి పరిస్థితి గుర్తొచ్చింది. సరియైన వాడిని వెతుక్కోవటానికి యిక్కడ టైమ్ దొరకటం లేదు. 'యెవరీ శిరీష్' ఆలోచిస్తోందామె.

యెప్పుడూ ప్రశాంతంగా వుండే నిత్యకళ్యాణిని చూస్తుంటే తనకి యెందుకలాంటి స్థితి లేదోననే అసూయ ఆమెలో నిగూఢంగా.

రెండ్రోజుల తరువాత శిరీష్‌కి కాల్ చేసి, "మీ కవిత వొక్కటి కావాలండి. కవి సమ్మేళనం ప్లాన్ చేస్తున్నాం," అని అడిగింది ప్రవీణ.

"మీరు..."

"మీకున్న అనేక వేలమంది అభిమానుల్లో నేనొక్కదాన్ని," అంది.

శిరీష్ సంతోషాన్ని దాచుకోడానికి ప్రయత్నిస్తూ, "అంతమంది అభిమానులేం లేరండి," అన్నాడు మొహమాటంగా.

'ఆఁ ఆ విషయం నాకు తెలుసులే,' అని మనసులో అనుకొంటూ, "యెప్ప డిస్తారు" అని అడిగింది.

"యెక్కడిమ్మంటారు"

"పోస్ట్ చేయండి. అయితే మీరీ విషయం మీలోనే వుంచుకోండి. ప్రొఫెషనల్ సీక్రెట్ అనుకోండి," అంది.

"ష్యూర్... ష్యూర్..."

"బై," అంది.

శిరీష్‌కి లోలోపల వో వుత్సాహపు పవనం.

నిత్యకళ్యాణికి చెపుదామా అనిపించింది. అంతలోనే ప్రవీణ యెవ్వరికీ చెప్పొద్ద నటం గుర్తొచ్చింది.

టి.వి.లో తన కవిత రావటం... గ్రేట్ అనుకొన్నాడు.

ప్రవీణకీ సరదాగా అనిపించింది... శిరీష్‌ని కదపగలిగింది.

అతను తన కవితని మర్చిపోకుండా ఆమె చెప్పిన అడ్రస్‌కి పోస్ట్ చేశాడు.

వో రెండ్రోజుల తర్వాత శిరీష్‌కి కాల్‌చేసి, "బాగుంది మీ కవిత. వండర్‌ఫుల్," అంది.

"మీ ఫేవరెట్ కవులు యెవరు" అడిగింది.

అతను చెప్పిన పేర్లు విని యెందుకు వాళ్ళంటే యిష్టమని అడిగింది.

అతను సిన్సియర్‌గా ఆమె అడిగినవాటికి జవాబులు చెపుతున్నాడు.

"మీ ఫోటో వొకటి పంపించండి," అడిగింది.

"ఫోటోనా... యెందుకండి... పబ్లిసిటీ యిష్టం లేదండి," అన్నాడు.

'యేయ్ఁ... తెలుసులే... పబ్లిసిటీ యిష్టం వుండదు... గుర్తింపు యిష్టంలేని వాళ్ళెవ్వరు! అమాయక చక్రవర్తి తెలుసులే,' అనుకొంటూ, "మీకిష్టం వుండదని తెలుసు. కానీ మిమ్మల్ని చూడాలని మీ అభిమానులు చాలాచాలా కోరు కుంటారు. అభిమానుల కోసం..." అందామె నమ్రతగా.

శిరీష్‌కి తను చేస్తున్న వుద్యోగం నుంచి మారిపోవాలని వుంది. టి.వి.లోకి వెళ్ళటం యెలాగా అని ఆలోచిస్తున్నాడు. నిత్యకళ్యాణిని అడుగుదామనుకున్నాడు.

వోరోజు ప్రవీణ కాల్ చేసి కవిత్వం విషయాలు మాట్లాడి, "మీకు టి.వి.లోకి వచ్చే ఆసక్తి వుందా!" అని అడిగింది.

"వుంది. కాని సోర్స్ తెలియదు," అన్నాడు.

"నేనో సోర్స్ చెపుతా. ప్రయత్నించండి," అంది.

"థాంక్యూ," అన్నాడు.

"నాకేమిస్తారు జాబ్ వస్తే"

"రావాలే కానీ మీరే పార్టీ అడిగినా యిస్తా."

"పార్టీ... పార్టీ కాదు. మీకు ఆ వుద్యోగం యెలా వస్తుందో, యెవరితో మాట్లాడితే వస్తుందో నే చెపుతా. చాలా కాంపిటీషన్ వుందా వుద్యోగానికి. మీకు క్వాలిఫికేషన్ వుంది. మీకా జాబ్ వస్తే మీరూ నన్ను నా ప్రొఫెషనల్‌లో యెంకరేజ్ చేయాలి. మీకూ, నాకూ పరిచయం వున్నట్టు కానీ, రెగ్యులర్ కాంటాక్ట్‌లో వుంటున్నట్టు యెవరికీ యిప్పుడప్పుడే తెలియకూడదు. జాబ్‌లో మీరు సెటిల్ అయ్యాకే మనిద్దరికి పరిచయం వున్నట్టు తెలియవచ్చు. అంతే... సరేనా! మనిద్దరి డీల్ యేమాత్రం బయటికి వచ్చినా జాబ్ వచ్చే అవకాశాలు తక్కువ," అని కాస్త బెదిరించింది.

యీ ప్రొఫెషన్‌లో తన టాలెంట్‌పై తను నెగ్గుకు రాలేనని ప్రవీణకి తెలుసు. మిగిలిన యాంకర్స్‌కి వున్నంత అందం, గ్లామర్, వాక్ చాతుర్యం తనకి లేవని ఆమెకి తెలుసు. తనని ప్రమోట్ చేసే వ్యక్తి కావాలి. ఆ మనిషికి అంతో యింతో పవర్ లేకపోతే తను ఆ ప్రొఫెషన్‌లో కంటిన్యూ కాలేనని ఆమెకి తెలుసు. అలవాటు పడాలి తన ముఖానికి ప్రేక్షకులు. అంతవరకు తను నెగ్గుకు రావా లంటే తన మాట వినే వ్యక్తి అధికారంలో వుండటం అవసరం. మోస్ట్ యెలిజబుల్ వ్యక్తి శిరీష్ అని ఆమెకి నమ్మకంగా అనిపించింది.

రంగురంగుల కొవ్వొత్తులు ముచ్చటైన ఆకృతుల్లో... వో గుండ్రని చిన్ని టేబిల్‌కి అటూ యిటూ కుర్చీలు... నీళ్ళపై తేలుతోన్న పసుపు యెరుపు గులాబి తెలుపు పువ్వుల రేకులు... లేత వెలుగులో వీస్తోన్న లేత పరిమళం... పెర్‌ఫ్యూమ్ కేండిల్ వెలుగు చిమ్ముతోన్న వైట్ వైన్‌గ్లాసుని పట్టుకొన్న కుడిచేతి వేలిగోళ్ళపై మెరుస్తోన్న బ్రౌన్ నైల్ పాలిష్. శిరీష్ తన చేతిని చాచి ప్రవీణ చేతివేళ్ళని మెల్లగా స్పర్శిస్తూ, "థాంక్యూ," అన్నాడు.

ఆమె అతని కళ్ళల్లోకి చూస్తూ సమ్మోహనంగా నవ్వి, "వుద్యోగం వచ్చేసింది. యిలా మిమ్మల్ని యిప్పుడు చూడగటం గమ్మత్తుగా వుంది. గుడ్ పార్టీ. గుడ్ కంపెనీ. వొక్కసారైనా మాట్లాడాలనుకున్నాను. మీరింత అందంగా వుంటారని తెలియదు. ఐ లైక్ యూ..."

జీవితం ప్రతి మలుపులోనూ అసాధారణమైన ఆనందాన్నీ, అనుభవాలనీ కోరు కుంటూ వొక చిన్న వూర్లో పుట్టి, వో సాధారణమైన బడిలో, కాలేజీలో చదువుకొని

పై చదువులు చదువుకొనే తెలివితేటలున్నా, ఆర్థికంగా అవకాశం లేక అందివచ్చిన అవకాశాలని వెతుక్కుంటూ అందుకొంటూ యీ నగరానికి వచ్చిన అతనికి తొలిరోజుల్లోని పరిచయాలు చిన్నచిన్న స్నేహాలు ఆనందాన్నిచ్చేవి. సరియైన వుద్యోగం లేదని బంధువులే పిల్లనివ్వటానికి జంకుతున్న రోజుల్లో తనకి నచ్చిన వరసకి మావయ్య కూతురైన అమ్మాయికే తన మనసుని చెప్పలేకపోయాడు. తను వో పేపర్‌లో పనిచేస్తున్న కాలంలో తనకంటే మంచి వుద్యోగం చేస్తున్న నిత్యకళ్యాణిని యిష్టపడుతున్నప్పుడు కాస్త బెరుగ్గానే ఆమెకి విషయం చెప్పాడు. నిత్యకళ్యాణి తనని వొప్పుకోవటం తనకెంతో ఆనందాన్నిచ్చింది. ప్రవీణ ప్రోత్సాహంతో తను ప్రయత్నించగా టి.వి.లో మంచి వుద్యోగం... వొక్కసారిగా తన చుట్టూ తనెప్పుడూ వూహించని రీతిలో రకరకాల మనుషులు... తన పరపతి పెరుగుతోంటే తన చుట్టూ అనేకానేక పరిచయాలు.

యిప్పుడు ప్రవీణ... యాంకర్‌గా యెదగాలని ప్రయత్నిస్తోన్న ప్రవీణ తనని కోరు కొంటోంది. అతనికి చప్పున నిత్యకళ్యాణి గుర్తొచ్చింది. వొక్కసారి తల విదిల్చాడు. మనుష్యులు యెదిగేకొద్దీ అభిప్రాయాలు, యిష్టాలు మారుతుంటాయి. యిష్టపడే వాళ్ళు పెరుగుతుంటారు. కాదనలేం కదా...

ఆ లేత వెలుగులో మెరుస్తోన్న అతని చేతివేళ్ళపై చిన్నగా ముద్దుపెట్టింది ప్రవీణ.

ఆ ముద్దు ఆమె జీవితాన్ని ఆమె ఆశించిన రీతిలో వెలిగించింది.

శిరీష్ ప్లాన్ చేసిన వో పాపులర్ షోకి తరువాతి వారంలో ఆమె యాంకర్ అయింది.

రెండు నెలలుగా యెలాగైనా వొక్కసారి శిరీష్‌ని కలవాలని నిత్యకళ్యాణి చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించలేదు. శిరీష్ అతి చాకచక్యంగా ఆమెని కలవటాన్ని పోస్ట్‌పోన్ చేస్తున్నాడు. యెప్పుడు ఫోన్ చేసినా యేదో వొక పని కష్టం చెప్పి బిజీ అని తప్పించుకొంటున్నా, అదంతా నిజమే అని నమ్మించాడు. కొత్త వుద్యోగం... బిజీ అనుకొందామె.

"చాలారోజులైంది శిరీష్... వొక్కసారి కనిపించు. కాఫీ తాగినంత సమయం," అంది.

"సరే, పార్క్ దగ్గర వుండు," అన్నాడు.

"పార్క్ బయటా," అడిగింది.

'ఆఁ... ఆ అక్కడొద్దు... ఆ దారిలో వెళితే పొరపాటున ప్రవీణ, తెలిసినవాళ్ళు కనిపిస్తే కష్టం,' అని ఆలోచించి, "సికింద్రాబాద్ కామత్‌కి రా," అన్నాడు. యీ సర్కిల్ వాళ్ళు యెవ్వరూ అటు రారని అతనికి బాగా తెలుసు.

ఆమె అక్కడికి చేరుకొని యెదురుచూస్తోంది.

అతను బయలుదేరే సమయానికి సరిగ్గా ప్రవీణ కాల్ చేసింది. కాకతీయాలో యెదురుచూస్తుంటా రారమ్మని. నిత్యకళ్యాణి కాల్ చేస్తుందేమోనని స్విచాఫ్ చేశాడు సెల్‌ని. అతను పరవశంతో వెళ్ళిపోయాడు.

బిల్ పే చేస్తుంటే అతనికి నిత్యకళ్యాణి గుర్తొచ్చింది. ఆఁ కాసేపు చూసి వెళ్ళిపోతుందిలే అనుకొన్నాడు.

చూసిచూసీ అతని సెల్‌కి కాల్ చేసింది. స్విచాఫ్ చేసుంది.

బిజీగా వున్నాడేమోలేననుకొని హాస్టల్‌కి వెళ్ళిపోయింది.

✦

సంజనాకి యేం పాలుపోలేదు. యిదంతా నిత్యకళ్యాణికి యెలా చెప్పాలి. ప్రవీణని శిరీష్‌తో చూసినప్పుడు ఆమెపై చెప్పలేనంత కోపం వచ్చింది. ఆమె మాటలు వింటున్నప్పుడు అసహ్యం వేసింది. యిప్పుడు తీరిగ్గా ఆలోచిస్తుంటే ప్రవీణ మాటలు వాస్తవంగానే తోస్తున్నాయి. సంజన తన ఆలోచనతో తర్జనభర్జన పడుతుండగా నిత్యకళ్యాణి గదిలోకి వచ్చింది.

"అరే... యేంటలా వున్నావ్," ఆత్రంగా అడిగింది నిత్యకళ్యాణి.

ఆత్మీయత నిండిన ఆ సజల నేత్రాలని చూస్తుంటే సంజనాకి దు:ఖం వచ్చింది. తనకి తెల్సినంతవరకు నిత్యకళ్యాణి యెవరిని కష్టపెట్టటం చూడలేదు. యింత గాయాన్ని యీమె భరించగలదా... చెప్పకపోతే ఆమె యింకా భ్రమలోనే వుంటుంది. కష్టమో, నష్టమో యేది యేమైనా ముందు ఆమెని ఆ భ్రమలోంచి బయటికి తీసుకురావాలి.

"యివాళ ప్రవీణని, శిరీష్‌ని చాలా దగ్గరగా క్లబ్‌లో చూశా. ప్రవీణని యేంటని అడిగా. ప్రవీణ యేమందంటే...

'ప్రవీణా... యిందాక నీతో వున్న అబ్బాయి యెవరు,' అడిగింది సంజన.

‘నీకెందుకు... అయినా నీకు తెలియదా,’ అంది నవ్వుతూ.

‘అతనూ, నిత్యకళ్యాణీ పెళ్ళి చేసుకోవాలనుకున్నారు.’

‘అయితే.’

‘చూడు ప్రవీణా... మీ యిద్దర్నీ నేను చాలా దగ్గరగా చూశా. గత కొంతకాలంగా అతను కళ్యాణిని సరిగ్గా కలవటంలేదు. అతను పనిలో బిజీ అనుకుంటుందామె. పని బిజీనా... లేక మీరిద్దరూ బిజీనా తెలియాలి,’ అడిగింది సంజన.

‘అతను నన్ను యిష్టపడితే నేనేం చేయను,’ అంది ప్రవీణ.

‘ముందు కళ్యాణిని యిష్టపడి, యిప్పుడు నిన్ను యిష్టపడి, అతనికి కన్సిస్టెన్సీ లేదని నీకు అనిపించటంలేదా’

‘ఆఁ అంత కన్సిస్టెన్సీ నాకవసరం లేదు. చూడ్డానికి బానే వున్నాడు. సంపాది స్తున్నాడు. పేరు, డబ్బు సంపాదించే అమ్మాయి తన గర్ల్‌ఫ్రెండ్ అని చెప్పుకోవ టాన్ని యెంజాయ్ చేస్తున్నాడు. నన్ను ప్రమోట్ చేస్తున్నాడు. చాలవా యివి,’’ అని అడిగింది ప్రవీణ.

‘రేపు మరొకరిని యిష్టపడితే...’

‘శిరీష్ కంటే బెటర్ అవకాశాలు నాకిప్పించే వాళ్ళని నేను యిష్టపడనని గ్యారెంటీ యేంలేదు. యిదిగో నేనెప్పుడూ శిరీష్‌కి నిత్యకళ్యాణితో మాట్లాడొద్దని చెప్పలేదు. అతనూ యిప్పటివరకూ ఆమె పేరు నా దగ్గర యెత్తలేదు. అతను కళ్యాణిని యెవాయిడ్ చేస్తున్నాడని తెలుసు,’ అంది ప్రవీణ.

‘యెలా’

‘నువ్వంటే యిష్టమని చెప్పిన మగాడిని గుడ్డిగా నమ్మటానికి నేనేమైనా నిత్య కళ్యాణినా. నా వేగులు నాకున్నారు. నిత్యకళ్యాణికి డీల్ చేసుకోవటం రాలేదు. డీల్ చేయలేదు కూడా. యెందుకంటే యిప్పుడు బంధాలు, సంబంధాలకి ప్రాతి పదిక, అవసరాలు, ప్రేమ కాదు. సిన్సియారిటీ అసలే కాదు. బిజినెస్ డీల్. అంతే మనకి యిష్టం వున్నా, లేకపోయినా మనం వొప్పుకున్నా, వొప్పుకోకపోయినా మనం అన్ని రకాలుగా యెదగడానికి వుపయోగపడే పరిచయమే బంధం కావొచ్చు. యీ పరస్పర వ్యాపార సంబంధానికి రవ్వంత యెమోషన్స్‌ని జోడిస్తే బంధం యేర్పడుతుంది. యీ పరస్పర వ్యాపార సంబంధాన్ని యెంత కాలం

సజీవంగా వుంచుతామో అంతవరకు బంధం వుంటుంది. యిప్పుడీ జీవితాలని పాత పద్ధతుల్లో అర్థం చేసుకొని డీల్ చేస్తే దు:ఖమొక్కటే మిగుల్తుంది. అందుకే అన్నాను నిత్యకళ్యాణికి డీల్ చేసుకోవటం రాదని,' అంది ప్రవీణ.

సంజన నోట మాట రానట్టు వెర్రిగా ప్రవీణని చూస్తోంది. 'తనలాంటి వో అమ్మాయి యింత వివరంగా యిన్నేసి విషయాలని యింతలా మాట్లాడుతుం దేంటి. యివన్నీ నిజమేనా...'

'నచ్చలేదా సంజనా, యేం మీ ఆఫీసులో పైకి రావాలని మీ స్కిల్స్ పెంచుకోవ డానికి, క్వాలిఫికేషన్ పెంచుకోవడానికి ప్రయత్నించటంలేదా. వున్న వాళ్ళలో జీవితాన్ని పంచుకోవడానికి మోస్ట్ యెలిజబుల్ బ్యాచెలర్ యెవరని బంధువు ల్లోనో, వెబ్‌సైట్స్‌లోనో, మ్యారేజ్ బ్యూరోస్‌లోనో యెదగటానికి అవకాశం వున్న అమ్మాయిల కోసం చూడటంలేదా. తమకంటే తాము చేసుకొనే అమ్మాయిలు బై అల్ మీన్స్ సౌండ్‌గా వుండాలని అబ్బాయిలు అనుకొంటున్నారు. అప్పుడే యెవైలబుల్‌గా వున్న కంఫర్ట్‌ని, ఫన్‌ని త్వరత్వరగా యెంజాయ్ చేయొచ్చను కుంటున్నారు. సో, యిందులో వెన్నుపోటులేం లేవు,' బ్రష్‌లో చిక్కుకున్న వెంట్రుకల్ని తీసి డస్ట్‌బిన్‌లో పడేస్తూ అంది ప్రవీణ.

'యివన్నీ మీరిద్దరూ మాట్లాడుకున్నారా,' ఆశ్చర్యంగా అడిగింది సంజన.

'యివన్నీ పత్తిపనిలా మాట్లాడుకోలేదు. అవే అర్థం అవుతుంటాయి. వొక్కో మెట్టూ యెక్కుతూ పైకి వెళ్ళటం శ్రమ, టైమ్ వేస్ట్. లిఫ్ట్‌లో వొక్కసారే కావాలనుకొన్న ప్లేస్‌కి ఠకీమని వెళ్ళిపోవచ్చు. యేమంటావ్. లిఫ్ట్ లేనిచోట నేను మెట్లు యెక్కి వెళ్ళను. అలాంటివి రిజెక్ట్ చేస్తా. వెస్ట్రన్ ఫిట్టింగ్స్‌ని రోజూ వేసుకోవటమే కాదు సంజనా, అలా ఆలోచించటం కూడా నేర్చుకో. సినిమాకి వెళదామా,' అడిగింది ప్రవీణ.

'నే రాలేనిప్పుడు.'

'వో... సంతాపమా... గుడ్‌లక్... బై,' హేండ్‌బ్యాగ్ తీసుకొని ప్రవీణ వెళ్ళి పోయింది.

నిత్యకళ్యాణి కళ్ళల్లోంచి ధారగా నీరు. ఆమె వొక్కమాట మాట్లాడలేదు. సంజన ఆమెని డిస్టబ్ చేయలేదు. రాత్రి బాగా పొద్దుపోయాక ప్రవీణ వచ్చింది. అప్పటికి నిత్యకళ్యాణి మంచంపై పడుకొని వుంది. నిత్యకళ్యాణి శిరీష్ విషయాలేమైనా మాట్లాడుతుందేమోనని ప్రవీణకి కాస్త బెరుగ్గానే వుంది.

నిత్యకళ్యాణి యెప్పట్లానే తన పనులన్నీ చేసుకొంటోంది. ప్రవీణతో యెప్పటిలాగే వుంది. ప్రవీణ మాత్రం నిత్యకళ్యాణిని ఆ వుద్యోగం నుంచి దూరం చేయాలను కొంది. ప్రయత్నాలు చేస్తుండేది. యెందుకో ప్రవీణకి యేవి కలిసొచ్చేవి కాదు. కళ్యాణి శిరీష్ విషయంలో యేం మాట్లాడకపోవటం యిద్దర్ని పూర్తిగా యిగ్నోర్ చేయటం ప్రవీణకి లోపలెక్కడో కాల్తోంది.

సంజన తన యం.బి.ఎ.లో మునిగిపోయింది.

యేడాది తిరిగేటప్పటికి నిత్యకళ్యాణి న్యూస్ సెక్షన్‌కి యిన్‌ఛార్జ్ అయింది. కొత్తగా మరికొంతమంది అమ్మాయిలు పొలిటికల్ బ్యూరోలోకి వచ్చారు. వుత్సాహం, హుషారు కలబోసి అంతా వొక టీమ్‌గా పనిచేస్తుండేవారు.

ప్రవీణని యాంకర్‌గా యెక్కువకాలం శిరీష్ ప్రమోట్ చేయలేకపోయాడు. ఆమె తనని ప్రమోట్ చేసేవాళ్ళ కోసం వెతుకుతూనే వుంది. శిరీష్ తన ఫీల్డ్‌లో యెదగ డానికి కావల్సిన స్కిల్స్, రాజకీయాలు, కాంప్రమైజ్‌లు నేర్చుకొంటూ తన ప్రొఫెషన్‌లో బిజీగా వున్నాడు.

సంజన యం.బి.ఎ. పూర్తయింది. వో మల్టీనేషనల్ కంపెనీలో టీమ్‌లీడర్‌గా వుద్యోగం వచ్చింది. లండన్ వెళ్ళే ముందు నిత్యకళ్యాణికి పార్టీ యిస్తానని వో రెస్టారెంట్‌కి పిలిచింది.

లాన్‌లో కూర్చున్నారిద్దరూ.

పల్చని మంచు వెన్నెల జల్లు.

యిద్దరి మధ్యా హరికేన్ లాంతరు లేత వెలుగు.

"నిత్యా! యెప్పట్నుంచో చిన్న క్యూరియాసిటీ. నువ్వు శిరీష్‌తో యీ విషయం మాట్లాడలేదెందుకు. యెలా నిలబడగలిగావ్," కుతూహలంగా అడిగింది సంజన.

నిత్యకళ్యాణి చిన్నగా నవ్వి, "చెపుతా. కానీ యిప్పుడు కాదు మరోసారి," అంది.

సంజన తిరిగి ఆ టాపిక్ తీసుకురాలేదు.

తరువాత రోజు సంజనకి యెయిర్‌పోర్ట్‌లో సెండాఫ్ యిస్తూ వో చిన్న గిఫ్ట్ ప్యాక్ యిచ్చింది నిత్యకళ్యాణి.

టేక్ ఆఫ్ అయి ఆకాశంలో విమానం సెటిల్ అయి యే వొడిదుడుకులు లేకుండా

వెళుతున్నప్పుడు నిత్యకళ్యాణి యిచ్చిన కవర్ విప్పింది. నైటింగేల్ పుస్తకంలో నల్లని యింక్‌పెన్‌తో రాసిన గుండ్రని చేతిరాత.

సంజనా,

నువు వెళుతున్నావంటే బోల్డంత దిగులేసింది. కాని తప్పదు. మా యింటి నుంచి వుద్యోగం కోసం యీ వూరొచ్చినప్పుడూ నే బెంగపడ్డాను. నిత్యం యిష్టమైన స్వరం వినాలనీ, యిష్టమైన వాళ్ళతో జీవించాలనీ వుంటుంది. కాని సాధ్యం కాదుకదా. నువ్వు అడిగావే నా ప్రేమానుభవం ముగిసిపోయినప్పుడు నేనెలా వున్నానని. నీతో పంచుకోవడానికి నాకేం అభ్యంతరం లేదు. యింతకాలం తరువాత వొక అవుట్‌సైడర్ స్థితికి నేనొచ్చేశాక ఆ విషయాలు మాట్లాడటం వో అనుభవం. యిందులోంచి నీకూ యేదైనా పనికిరావొచ్చు. నచ్చొచ్చు. యేం అనిపించకా పోవచ్చు. నీక్కావల్సింది యేమైనా వుంటే తీసుకోవచ్చని కాస్త వివరంగానే రాస్తున్నాను.

యిది మార్గశిరమో, శ్రావణమో తేల్చుకోలేకపోయానీవేళ. సన్నని జల్లు. పైనంతా మబ్బు. వానాకాలపు వెలుతురులో రోడ్లు, యిళ్ళూ, గోడలూ, చెట్లూ మెరుస్తు న్నాయి. కొబ్బరాకుల నుంచి జారుతూ నీటి బిందువులు. యిలాంటి వానాకాలపు రాత్రుల్లో పాటలు వింటూనో, పుస్తకాలని చదువుకుంటూనో యింట్లో అటూ యిటూ పచార్లు చేస్తుండేదాన్ని. వానంటే చాలిష్టం. యింటి నుంచి దూరంగా వచ్చినా వానని ఆస్వాదిస్తూనే వున్నాను. పుస్తకాలు, పాటలు నాతోనే వున్నాయి. భావ ప్రపంచం విస్తరించింది.

శిరీష్... కవి. పుస్తకాలంటే యిష్టం. అంతో యింతో భావుకుడు. యిష్టపడ్డాం. అయితే నే దు:ఖపడ్డాను. అతన్ని యేం అడుగుతాం. మాటలని అర్థం చేసుకొనే స్థితిలో అతనుంటే నన్నెందుకు వద్దనుకుంటాడు. యిన్ని రోజుల ఆలోచనల్లో నాకేమనిపించిందంటే యిష్టం, ప్రేమ, మోసం, అవకాశం, అసూయ యేదైనా తీసుకో, జీవితంలోని యే రాగద్వేషాల షేడ్స్‌నైనా తీసుకో. వాటిని యిన్‌ఫ్లూయెన్స్ చేసే పరిస్థితులు మన చుట్టూ ఆపరేట్ అవుతున్న సోషియో పొలిటికల్ యెకనమిక్ కండిషన్స్‌పై వుంటాయనిపిస్తుంది. ప్రేమలో యిటువంటి యెత్తులు, జిత్తులు, రాజకీయాలు, ప్రపోజల్స్, యెమోషన్స్ వో పదిపదిహేనేళ్ళ క్రితం వుండే అవకాశం లేదు. అప్పుడూ ప్రేమలో గాయాలుండేవి. కానీ వాటి రూపం సారం వేరు.

శిరీష్ వొకప్పుడు నాకన్నీ. యిప్పుడు అపరిచితుడు.

అతనికి ముందూ నాకో జీవితం వుంది. అతని తర్వాత జీవితం వుంది. జీవితానికి ముఖ్యమైన వో పార్శ్వపు ప్రేమ తిరిగి నా జీవితంలోకి రావొచ్చు. కాని ముగ్ధత్వంతో కూడిన ప్రేమ యిక సాధ్యం కాదేమో. నన్ను నేను యెంత వోదార్చుకున్నా, నచ్చచెప్పుకున్నా ప్రేమ విషయంలో పూర్తిగా యిచ్చేసుకోలేనేమో. క్రిటికల్‌గా వుంటానేమో... ఆ మేరకు నష్టపోయాను. వో రకంగా యీ గాయం నుంచి కొన్ని విషయాలు తెలుసుకున్నాను. మానవ జీవితంలో పరిచయాలలో, స్నేహాల్లో, అనుబంధాల్లో యింత నిలకడలేనితనం, యిన్‌సెక్యూరిటీ, తడిలేనితనం యింతకు ముందెప్పుడూ లేదనుకొంటా. సాహిత్యం ఆయా కాలానికి సంబంధించిన జీవితానుభవాలని మనకి అందిస్తుంది కదా. యెక్కడా యిలాంటి స్థితిలేదు. యీ వాతావరణంలో మనం హృదయానికి సంబంధించినంతవరకు బాధితులం.

పర్సనల్, అఫీషియల్ జీవితంలో నాకు ప్రశాంతిని యిచ్చిన స్నేహాలు పెద్దగా లేవు. కొన్ని స్నేహాలు విడిపోతున్నప్పుడు బాధని, బెంగని కలిగించాయి. యెప్పుడూ నాకు ప్రశాంతి సాహిత్యంలోనే దొరుకుతుంది.


శిరీష్ గాయాన్ని సేదతీర్చింది సాహిత్యమే. కోపంతో, అసూయతో, బాధతో నన్ను నేను కోల్పోకుండా కాపాడింది సాహిత్యమే. యిందులో కొన్ని పుస్తకాల పేర్లు రాశాను. చదవాలనిపిస్తే చదువు. ఆ సాహిత్యం నిన్ను లాక్కుంటే నీ జీవన ప్రయాణంలో నీకో స్థిరమైన స్నేహం దొరికినట్టే.

ప్రేమ, జ్ఞానం, శక్తి యేమైనా మనలోనే వుంటే యే కొత్త ప్రపంచం మన నుంచి మనలని లాక్కోలేదు. మనం ప్రవహిస్తూనే వుంటాం.

ప్రేమతో,

నిత్యకళ్యాణి.

వుత్తరాన్ని మధ్యమధ్యలో అలాఅలా చదువుతూనే వుంది సంజన. ఆ పుస్తకాల లిస్ట్‌పై ఆమె చూపులు నిలిచాయి.



పత్రిక

అక్టోబర్ 2003